క్లుప్తంగా

పరామర్శ



చంద్రమౌళిని పరామర్శిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): విజయనగరం ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ సెక్రటరీ కుప్పిలి చంద్రమౌళి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు.ఆయన్ని గరివిడి పట్టణంలోని నివాసంలో ఎన్ఎంయూ నాయకులు మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనువాసరావు, జోనల్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్,జోనల్ చైర్మన్ సూర్యం ,జోనల్ సెక్రటరీ రాములు, కార్యదర్శి శేఖర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి యాతపేటలో సోమవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పట్నాన అప్ప న్నకు చెందిన పూరిపాక దగ్ధమైంది.బాధిత కుటుంబాన్ని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మంగళవారం పరామర్శించి, రూ.3 వేల నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తామని తెలిపారు.వీఆర్ఓ ప్రభాకరరావు, నాయ కులు కోరాడ కృష్ణ, తాళ్లపూడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ సంబరాలు



పార్వతీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న కుమరాం గ్రామస్తులు

జామి: మండలంలోని కుమరాం గ్రామంలో గౌరమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామస్తులు వరి దుబ్బులను గౌరీదేవిగా అలంకరించి, పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు.అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.నాగులు చవితిరోజున నిమజ్జనం చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

పశు అక్రమ రవాణాపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం నుంచి కబేళాలకు పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని, అక్రమ రవాణాను నియంత్రించేలా చూడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరామని గజ పతినగరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సరిది దుర్గా ప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి రోజ్‌గార్‌మేళా ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంగళవారం విశాఖపట్నం వచ్చిన మంత్రి సంజయ్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు.ఒడిశా నుంచి వ్యాధుల బారిన పశువులను పార్వతీపురం మన్యం జిల్లా మీదుగా బొలేరో వాహనాల్లో పెదమానాపురంనకు తీసుకువచ్చి అక్కడి నుంచి పెద్ద పెద్ద కంటైనర్లలో కేరళ, విశాఖపట్నం రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల్లోని కబేళాలకు తరలిస్తున్నారని మంత్రికి వివరించామని చెప్పారు. పశువుల రవాణాను పోలీ సులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, లక్షల రూపాయల లంచం తీసుకుంటున్నారని మంత్రికి దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న సీఎస్‌డీటీ మూర్తి

జామి: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీ మూర్తి మహిళా పోలీసులు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలకు సూచించారు. మండల కేంద్రంలో మహిళా పోలీసులు, వీఆర్ఓలు, వీఆర్ఏలతో మంగళవారం ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు.లబ్ధిదారుల నుంచి ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, బయట మార్కెట్‌లో విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ఉచిత గ్యాస్ పథకం విధి విధానాలను వివరించారు. ఈ రెండు అంశాలపై గ్రామాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎక్కడి పనులు అక్కడే..?

- ముందుకు సాగని గజపతినగరం ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణాలు
- భవన నిర్మాణాలకు రూ.17 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ముందే శ్లాబ్‌లు పూర్తయిన భవన నిర్మాణాలు
- ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక నిలిచిపోయిన పనులు



అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో అదనపు భవన నిర్మాణాల పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు వరకు ఈ ఆస్పత్రి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉండేది. అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవతో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం 100 పడకల ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచింది. జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రికి వెళ్లాల్సిన పనిలేకుండా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, అన్నిరకాల వైద్యసేవలు స్థానికంగా అందించేలా చర్యలు తీసుకుంది. 15మంది వైద్యులతో పాటు అవసరమైన సిబ్బందిని అప్పటి ప్రభుత్వం నియమించడంతో పాటు 100 పడకల ఏర్పాటుకు తగిన విధంగా అదనపు భవనాల కోసం రూ.17 కోట్లు మంజూరు చేసింది. పాత ఆస్పత్రి భవనంపై రెండు అంతస్తులు, పక్కనే కొత్తగా మరో రెండు బ్లాక్‌ల్లో మూడు అంతస్తుల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎన్నికలకు ముందే అన్ని భవనాల శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత నిలిచిపోయిన పనుల్లో మళ్లీ ఇంత వరకు ఎటువంటి పురోగతి లేదు. రోగుల సంఖ్యకు తగ్గట్లుగా



గదులు సరిపడక ఆస్పత్రి వరండాలో ఉంచిన మందుల స్టాక్

ప్రస్తుతం ఆస్పత్రిలో గదులు లేకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మందులను వరండాల్లోనే భద్రపరుస్తున్నారు. ఇటీవల ఆస్పత్రిని సందర్శించేందుకు వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వైద్యులు సమస్యను వివ రించగా, ఆస్పత్రి పాతభవనంపై నిర్మిస్తున్న రెండు అంతస్తులను మార్చినెల నాటికి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పక్కనే నిర్మిస్తున్న మూడు అంతస్తు ల భవన నిర్మాణాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. భవననిర్మాణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దాదాపు పూర్తి కావచ్చాయని, పెండింగ్ పనులు చేయడానికి కూటమి ప్రభుత్వానికి ఇంకా ఎన్ని నెలల సమయం కావాలని స్థానికులు, రోగులు ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మందకొడిగా సాగుతున్నాయి



ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పాత బిల్డింగ్‌పై నిర్మిస్తున్న రెండు అంతస్తుల భవనాలను అయినా త్వరగా పూర్తి చేస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. భవనాలు సరిపడక రోగులతో పాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – డాక్టర్ జగదీష్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మద్యం దుకాణం వద్దంటూ వినతి



పంచాయతీ ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గౌరీశంకర్ కాలనీ మహిళలు

శృంగవరపుకోట: అటు గుడి..ఇటు బడి.. ఎదురుగా పంచాయతీ కార్యాలయం, మరోపక్క నిత్యం రద్దీగా ఉండే ప్రకాశం మార్కెట్ ప్రాంతంలో మద్యం దుకాణం పెడితే మరిన్ని తగువులు, కొట్లాటలు జరిగి జనం ఇబ్బందులు పడతారని, మద్యం దుకాణం వద్దంటూ గౌరీశంకర్‌కాలనీ మహిళలు అధికారులకు మొరపెట్టుకున్నారు.మద్యం దుకాణం ఏర్పాటును మహిళలు సోమవారం అడ్డుకోగా...స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీ కార్యాలయంలో ఈఓకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. హరిజన వీధి, గౌరీశంకర్‌కాలనీ, యాతవీధి, కోటవీధి, వేమలివీధి, సాలివీధి ప్రజలంతా కలిసే మార్కెట్ వద్ద దుకాణం ఏర్పాటు సరైన ఆలోచన కాదని చెప్పారు. తమ అభ్యంతరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి దుకాణం ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని కోరారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే లలిత కుమారికి వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో పట్టాలమ్మ నాయీ బ్రాహ్మణ సంఘం భవనానికి స్థలం కేటా యించాలని కోరుతూ సంఘ సభ్యులు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎమ్మెల్యేను ఆమె నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ సభ్యులు మాట్లాడుతూఎన్నో ఏళ్లుగా కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, సంఘం సమావేశాలు నిర్వహించుకునేందుకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తహసీల్దార్‌తో చర్చించి భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వండి అంటూ ఎస్.కోట పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ కె.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు నానాటికీ అధ్వానంగా తయారవుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగం తీరు దున్నపోతు మీద వానపడ్డ తీరున ఉందన్నారు. తల్లికి వందనం పథకంపై స్పష్టత కరువైందని వాపోయారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రహరీలు, ఫ్యాన్లు, దోమతెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని చోట్ల వాచ్‌మెన్లు, కమాటీలు, కుక్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని, డిగ్రీలో హానర్స్ విధానం రద్దు చేయాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే దుశ్చర్యలు ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాదీవెన, వసతిదీవెన బకా యిలు రూ.3,480 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం కో-కన్వీనర్ వి.భార తి, జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, వి.చరణ్, మండల అధ్యక్షుడు పి.రత్నంనాయుడు, సభ్యులు ఇంద్ర, అనిత, చరణ్ జి.కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో తీర్మానించిన పనులనే చేయాలి



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయ ఏఓ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



బొండపల్లి : ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ తులసీరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గుర్ల/బొండపల్లి: గ్రామసభల్లో తీర్మానించిన పనులనే ఉపాధి హామీ నిధులతో చేయాలని, వాటిని కూడా సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని, పంచాయతీ నిధులను పక్కదారి పట్టించొద్దని గుర్ల, బొండపల్లి మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలుఅధికారులను కోరారు. గుర్లలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసప్పలనాయుడుతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ వర ప్రసాద్,ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవికి, బొండపల్లిలో ఎంపీపీ చల్లా చలంనాయుడుతో కలిసి ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కె.తులసీరామ్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, ఉపాధి హామీ చట్టం మేరకు ఆ పనులు చేయా లన్నారు. ఉపాధిహామీ పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని చట్టంలో ఉందన్నారు. సర్పంచ్‌ల హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. సర్పంచ్‌లతో కాకుండా వెండర్ పేరిట టీడీపీ నాయ కులతో పనులు చేయించడం చట్టవిరుద్ధమన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వెండర్ల ద్వారా పనులు చేయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. గుర్ల వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, బొండపల్లిలో ఆ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



బొండపల్లి: గొల్లుపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు



జామి: జామిలో చెరకు సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

పంటలో సాగులో వ్యవసాయ సిబ్బంది సూచనలతో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు అన్నారు.బొండపల్లి మండలంలోని గొల్లుపాలెం,దేవుపల్లి, జామి మండల కేంద్రంతో పాటు, భీమసింగి, దత్తిరాజేరు మండలంలోని గదబవలస, వేపాడ మండలంలోని చినగుడిపాల, గంట్యాడ మండలంలోని మధుపాడ, మదనాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువుల ఆవశ్యకత, చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. – బొండపల్లి/జామి/దత్తిరాజేరు/ వేపాడ/ గంట్యాడ

• నిరుపయోగంగా మరుగుదొడ్లు



బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలనే ధ్యేయంతో గ్రామాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా, దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఒంపల్లిలో గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు వద్ద గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. టీడీపీ నాయకులే కాంట్రాక్టర్ అవతారం ఎత్తి వీటిని నిర్మించారు. నాసిరకంగా నిర్మా ణాలు చేపట్టడంతో పాటు రన్నింగ్ వాటర్ సదుపాయం కూడా కల్పించకపోవడంతో ఇవి వినియోగానికి పనికిరాకుండా పోయాయి. ఒక్కరోజు కూడా వాటిని ప్రజలు వాడిన దాఖలాలు లేవు. – బొండపల్లి

• తాగునీరు వృథా



తాటిపూడి నుంచి విశాఖపట్నానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లో కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం రైల్వే వంతెన వద్ద తాగునీరు వృథాగా పోతోంది. కొంతమంది స్థానికులు పైపులైన్‌కు ఉన్న ఇంటర్ లాకింగ్ సిస్టమ్ వద్ద కర్రతో లాక్‌ను ఓపెన్ చేసి నీటిని పట్టు కుని తర్వాత లాక్ వేయకుండా విడిచిపెట్టేస్తున్నారు. నిత్యం ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. – కొత్తవలస

• మూలకు చేరిన మిక్సింగ్ యంత్రం



మెరకముడిదాం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మిక్సింగ్ యంత్రం ఏళ్ల తరబడి మూలనపడి ఉంది. ఎండకు ఎండుతూ వానకు తడవడంతో తుప్పపట్టిపాడైంది. పనికివచ్చే యంత్రాన్ని ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారన్న ప్రశ్నకు ఉద్యోగుల నుంచి జవాబు కరువైంది. – మెరకముడిదాం

• సత్తాచూపారు



వేపాడ మండలం బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో సత్తాచూపారు. కర్నూలులోని డీఎస్ఆర్ అవుట్ డోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడల్లో పాఠశాలకు చెందిన బి.రేవతి 1500 మీటర్ల పరుగు పందెం, కీర్తి నాలుగు కి.మీ రన్నింగ్, తనుశ్రీ 400 మీటర్ల హ్యాండిల్స్‌లో విజేతలుగా నిలిచారు. అలాగే అతియా-పాతయా టీమ్‌గేమ్‌లో మూడోస్థానంలో నిలిచిన జట్టులో పాఠశాలకు చెందిన ప్రవళిక, జ్యోత్స్న ఉన్నారు. జావెలిన్ త్రోలో శిరీష మూడోస్థానం, రేస్‌వాక్‌లో సీహెచ్ కీర్తి నాలుగో స్థానంలో నిలిచారు. విద్యార్థినులతో పాటు పీఈటీ అరుణ, పీడీ సంతోష్‌కుమారిని ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. – వేపాడ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చీపురుపల్లిరూరల్(గరివిడి): శివరాం హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



జామి: యోగా పోటీలకు ఎంపికైన విజినిగిరి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం సీతారామయ్య



శృంగవరపుకోట: బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు ఎంపికైనకోటేశ్వరరావు, సంతోష్‌కుమార్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం మీసాల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బాలికలు, బాలుర విభాగాల్లో ఆర్.సృజన, మహంతి రమణ, జి.ప్రకాశ్, ఎం.చంద్రశేఖర్, బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో జానకి, మాల్కంబ్ పోటీల్లో బాలికల విభాగంలో ఎం.మహాలక్ష్మి, బాలుర విభాగంలో వి.గుణశేఖర్, జి.ప్రకాశ్, త్రోబాల్ పోటీల్లో దిలీప్, బాలికల క్రికెట్‌లో ఎస్.యమున, త్రోబాల్ అసోసియేషన్ పోటీల్లో ఎం.హారిక సత్తా చాటారు. వీరు నవంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నారు. విద్యార్థులను హెచ్ఎంతో పాటు పీడీ వి.ఉషారాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.రామునాయుడు అభినందించారు.

యోగా పోటీలకు...

జామి: విజినిగిరి గ్రామంలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్ మంగళవారం తెలిపారు. అండర్14, 17, విభాగాల్లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో విద్యార్థులు దుర్గాసత్యసాయి, దినేష్ కార్తీక్, గోవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. నవంబర్ 2,3,4 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నారు.హెచ్ఎం సీతారామయ్య, యోగా శిక్షకుడు సన్యాసిరావు అభినందించారు.

ఎస్.కోట ఆర్టీసీ ఉద్యోగుల సత్తా

శృంగవరపుకోట: జిల్లా కేంద్రం విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో ఎస్.కోట ఆర్టీసీ డిపో ఉద్యోగులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు బ్యాడ్మింటన్ పోటీలకు కొల్లి కోటేశ్వరరావు, చెస్ పోటీలకు కె.సంతోష్‌కుమార్ అర్హత సాధించారు. నవంబర్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ విజయవాడలో నిర్వహించనున్న పోటీల్లో వీరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని స్థానిక డిపో మేనేజర్ కె.రమేష్, తదితర ఉద్యోగులు, జె.కె.కోర్టు ప్లేయర్లు అభినందించారు.

సంక్షిప్తంగా...

వేమలిలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో మంగళవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 68 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం గృహసందర్శన చేసి శిబిరానికి రాలేక పోయిన వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు సేవలందించారు.

ఆహార నియమాలు పాటించాలి

గజపతినగరం: ఆహార నియమాలు పాటిస్తే ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని న్యూట్రిషన్‌లు రమేష్,శిరీష తెలిపారు. మండలం లోని పురిటిపెంట బాలాజీ నగర్ కాలనీలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. మారిన ఆహార అలవాట్ల వల్ల చాలా మంది రోగాల పాలవుతున్నారని, నిత్యం మందులు వాడాల్సి వస్తోందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి విధిగా పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్‌కి స్వస్తి చెప్పాలన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తీయిస్తున్న ఉద్యోగులు

శృంగవరపుకోట: మండలంలోని కాపుసోంపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 22/1లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురయ్యిందని ఫిర్యాదులు అందడంతో వీఆర్‌ఓ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 30 సెంట్ల స్థలం ఆక్రమణలో ఉన్నట్టు నిర్ధారించి, జేసీబీతో ఆక్ర మణలు తొలగించారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



సమావేశమైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

వేపాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కమిటీ చైర్మన్, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన పీహెచ్‌సీలో మంగళ వారం నిర్వహించారు.ఆస్పత్రి ఆవరణలో 104, 108 వాహనాలకు షెడ్, మీటింగ్ హాల్ నిర్మాణం, ఆస్పత్రికి అవసరమైన పర్నీచర్ సమకూర్చడం తదితర అంశాలపై చర్చించి, తీర్మానం చేశారు. డాక్టర్ ధరణి, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే..



మాట్లాడుతున్న తహసీల్దార్ అజా రఫీజాన్

మెరకముడిదాం: సమగ్రభూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అజా రఫీజాన్ తెలిపారు. బాడాం గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు.రైతుల నుంచి వినతులు స్వీకరించారు. రైతులు ఇచ్చిన వినతిపత్రాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.మండల సర్వేయర్ శంకరరావు, వీఆర్‌ఓ తిరుపతిరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.